క్లుప్తంగా

వైభవంగా పుష్పయాగం



విశేష అలంకరణలో అలివేలుమంగమ్మ, పద్మావతి సమేత నల్లగుండ్రాయస్వామి

బైరెడ్డిపల్లె : మండలంలో కడపనత్తం సమీపంలోని శ్రీ నల్లగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, వేదికపై కొలువుదీర్చి, వేదపండితులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే నెల్లిపట్ల సమీపంలోని శ్రీమరగదాంబ సమేత శ్రీ మార్గసాహేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి మెరవణి నిర్వహించారు.

శ్రీవారికి వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు: పట్టణంలో కోనేటి వద్ద ఉన్న శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్ర బాబు, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో పూజలు, హోమాలు చేశారు. శ్రీవారికి వసంతోత్సవం అనంతరం పురవీధులలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

మృతురాలికి ఎమ్మెల్యే నివాళి



రత్నమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని కల్లుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరి శివారెడ్డి మాతృమూర్తి రత్నమ్మ(83) సోమవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ మంగళవారం కల్లుపల్లెకు వెళ్లి రత్నమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



పులిచెర్లలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేష్ బాబు కోరారు. ఓటు హక్కుపై మంగళవారం వెలుగు కార్యాలయం వద్ద మహిళలతోఅవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఓటుతో సమర్థవంతమైన నాయకులని ఎన్నుకోవచ్చన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. మధుసూదన్, సుగుణమ్మ, శౌకత్‌అలీ, వెలుగు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'అధిష్టానం నిర్ణయమే ఫైనల్'

పలమనేరు: పలమనేరు నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్టానం ఇంకా ఎవరినీ ప్రకటించలేదని డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పార్థసారథిరెడ్డితో కలసి మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మారిన పేదల బతుకులు

- ఇంటింటా 'సంక్షేమ' కాంతులు
- సమకూరిన ప్రాథమిక అవసరాలు
- నాటి పాలనలో కరువులు, వలసలు
- ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఆర్థికంగా బలోపేతమైన కుటుంబాలు
- నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.2,210కోట్లు



పలమనేరులో నాలుగువేల ఇళ్ల కాలనీ

పలమనేరు: జిల్లాలోని పడమటి నియోజకవర్గమైన పలమనేరులో జీవ నదులు లేవు. 80 శాతం మెట్ట భూములకు వర్షాధారమే ఆధారం. ఎక్కువమంది ప్రజలు వ్యవసాయ కూలీలుగా జీవనం. ఇక్కడ సగానికిపైగా దారిద్ర్యరేఖ దిగువన ఉంటున్న కుటుంబాలే. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో 82 శాతం కుటుంబాలకు నవరత్నాల సంక్షేమ పథకాలందడంతో వీరికి ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, బట్టకు లోటులేకుండా పోయింది. ప్రతి కుటుంబంలోని మహిళలు గ్రూపుల ద్వారా జీవనోపాధి పొందుతూ, సంక్షేమ పథకాల అండతో ఆర్థికంగా ముందుకెళ్లారు. ఫలితంగా పేదరికం శాతం తగ్గి, కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయి.

నాడు పంచాయతీకి నాలుగైదు ఇళ్లు.. ఇప్పుడు ఊర్లే..!

గత ప్రభుత్వాల పాలనలో పంచాయతీకి నాలుగైదు ఇళ్లుమాత్రమే మంజూరయ్యేవి. ప్రస్తుత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, ఐదు మండలాల్లో మొత్తం 13,307 ఇళ్లను మంజూరు చేశారు. వీటిల్లో 9180 ఇళ్లు పూర్తయ్యాయి. వీటితోపాటు 12,723మందికి అనుభవ సర్టిఫికెట్లను ప్రభుత్వం అందజేసింది. ఫలితంగా 98 శాతం మందికి పక్కా ఇళ్ల సమస్య తీరింది.

ఇప్పుడు అన్నీ ఉచితమే..!

గతంలో మే నెల వచ్చిందంటే పిల్లల చదువుల ఖర్చుకోసం అప్పులు చేయాల్సిందే. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం తప్పింది. స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకంటే దీటుగా తీర్చిదిద్దడంతోపాటు వివిధ పథకాల ప్రయోజనాలు అందుతుండడంతో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందనేది నిర్వివాదాంశం. నియోజకవర్గంలో నాడు-నేడు ఫేజ్-1 కింద ప్రభుత్వం 113 బడులకు రూ.27.31కోట్లు వెచ్చించింది. ఫేజ్-2లో 291 బడులకు రూ.118.06కోట్లను వ్యయం చేసింది. మొత్తం మీద 404 స్కూళ్లకు రూ.145.37 కోట్లు వెచ్చించి వాటి రూపురేఖలే మార్చేసింది.

రైతాంగం కళ్లలో సంతోషం

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎరువులు, నాణ్యమైన విత్తనాల కోసం పడిగాపులు పడే పరిస్థితి తప్పింది. క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ, ఉచితపంటల బీమా తదితర సేవలు దరిచేరాయి. ఫలితంగా 60వేల మందికి పైగా రైతులకు మేలు కలిగింది. నియోజకవర్గంలో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను రూ.11 కోట్లతో గంగవరం, బైరెడ్డి పల్లె మండలాల్లో నిర్మించారు. వీటి ద్వారా 1600 మంది రైతులు లబ్ధి పొందారు. రూ.16మల్టిపుల్ గోదాములను రూ.6.40 కోట్లతో నిర్మించారు. దీంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను గోదాములో నిల్వ ఉంచుకునేందుకు వీలు కలిగింది. వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతోంది. ఈ ప్రభుత్వం హంద్రీ-నీవా జలాలను నియోజకవర్గంలోకి తెచ్చింది.

నియోజకవర్గ సమాచారం

నియోజకవర్గంలోని మండలాలు
పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వీ.కోట

- మొత్తం జనాభా: 3,32,245 (2011 జనాభా లెక్కల మేరకు)
- ప్రస్తుత జనాభా: 3,50 లక్షల దాకా
- మొత్తం ఓటర్లు: 2,67 లక్షలు
- మొత్తం బీపీఎల్ కుటుంబాలు : 55వేలు
- 25 రకాల సంక్షేమ పథకాలతో డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ.1,615కోట్లు
- నాన్‌డీబీటీ ద్వారా 1.93లక్షల మందికి రూ.595 కోట్లు
- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం లబ్ధి : రూ.2,210 కోట్లు

అప్పట్లో కరువులు..వలసలే



గతంలో పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్న వృద్ధులు (ఫైల్)

గతంలో వర్షాలు లేక, అడుగంటిన భూగర్భ జలాల మట్టం అడగుంటి ఎండుతున్న బోర్లు, అతి కష్టంమీద పంటలు సాగుచేసినా గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఉండేది. పెట్టుబడులు రాక, రైతుబతుకు కష్టంగా మారి, అప్పులపాలైన రైతులు బెంగళూరుకు వలస పోవాల్సి వచ్చేది. అంతేకాకుండా పాడిపరిశ్రమ పరిస్థితి కూడా అంతంత మాత్రమే. ఇప్పుడు పలమనేరు పాడి పరిశ్రమ అభివృద్ధి చెంది సగానికి పలు కుటుంబాలకు కల్పతరువులా మారింది. దీంతో వలస వెళ్లాల్సిన అగత్యం తప్పింది. ఫలితంగా పలమనేరు కాలక్రమంలో మిల్క్ సిటీగా పేరు తెచ్చుకుంది. ఇక సామాజిక పింఛన్ల కోసం అప్పట్లో లబ్ధిదారులు పడిన ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఇంటి వద్దకే పింఛన్లు అందుతున్నాయి. పట్టణానికి సమీపంలోని టి.వడ్డూరులో గతంలో సగానికిపైగా జనం వలసలు వెళ్లేవారు..ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు.

బియ్యం లేక నూకలు కొనేవాళ్లు ఇప్పుడు ఎవరైనా ఉన్నారా?



నేను రోజూ మార్కెట్‌లో జనాల మధ్యన వ్యాపారం చేసేవాడిని. అప్పట్లో జనం అంగళ్లకాడికొచ్చి నూకలు కొనేవాళ్లు. పేదరికం సమస్యలతో సతమయ్యేవారు. ఎప్పుడో పండగొస్తేనే మాంసాహారం తీసుకునేవాళ్లు. ఇప్పుడు అంగళ్లలో నూకలనేవే కనిపించడం లేదు. వివిధ పథకాల రూపేణా నగదు అర్హుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయడంతో పేదల ఆర్థిక, కుటుంబ పరిస్థితులు మెరుగుపడ్డాయి.
–గేట్‌బాబు, పలమనేరు

నా కుటుంబం బాగుంది



నేను వితంతు పింఛను తీసుకుంటున్నా. మూడువేలు రావడంతో ఇంటి ఖర్చులు, అవసరాలకు వాడుకుంటున్నా. గ్రూపులో ఉన్నా కాబట్టి రుణాలు, పిల్లల చదువులకు భయం లేదు. ఏదో ఓ పని చేసుకుంటూ ప్రభుత్వ పథకాల అండతో నా కుటుంబం బాగుందంటే దానికి కారణం ప్రస్తుత ప్రభుత్వ పాలనే అని ధైర్యంగా చెప్పగలను.
–ధన, గంటావూరు

పింఛనే లేకుంటే ఎన్ని కష్టాలు పడేవాళ్లమో!



ప్రతినెలా మూడువేల పింఛను వస్తాంది. ముసలోళ్లం కదా..మా అవసరాలకు ఈ డబ్బు ఎంతో పనికొస్తాంది. పిల్లలపై ఆధారపడాల్సిన పనిలేదు. పథకాల వల్ల మా ఇంట్లో అందరం బాగున్నాం. ఎలాంటి ఇబ్బందులూ లేవు.
–గౌరమ్మ, ఎల్‌బీ నగర్, పలమనేరు



ఈ ప్రభుత్వంలో గడపవద్దకే అందుతున్న పింఛను



ప్రస్తుతం గ్రామాల్లోనే హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్న వైద్యులు



పలమనేరులో అభివృద్ధి చెందిన పాడి పరిశ్రమ





నాడు పూరిగుడిసెలు ఉన్న వారికి రాని ఇళ్లు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడమే మా లక్ష్యం



రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

వి.కోట: వలంటీర్లు ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, ఎన్నికల విధుల్లో పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల నేపథ్యంలో తమ పోస్టులకు రాజీనామా చేస్తున్నట్లు కుంభార్లపల్లె గ్రామ సచివాలయ వలంటీర్లు ప్రకటించారు. మంగళవారం 14 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాము మరోసారి జగనన్నను సీఎం చేసుకోవడానికి, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తమ వంతుగా కృషి చేయాలని నిశ్చయించుకుని రాజీనామాలు చేసినట్టు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం రాష్ట్రంలో పేదలు నిశ్చింతగా జీవించవచ్చని, ఆయన పరిపాలనను తాము స్వయంగా దగ్గరుండి చూసి ఈ నిర్ణయానికి వచ్చినట్టు చెప్పారు. అలాంటి పాలన మళ్లీ రావాలంటే తామంతా ఎమ్మెల్యే వెంకటేగౌడ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి పార్టీని అధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. అందుకే తాము రాజీనామాలు చేసినట్లు చెప్పారు.

కేంద్ర బలగాల కవాతు



పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని కల్లూరు సీఐ శ్రీనివాసులు కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు కల్లూరు, మంగళంపేట, కొత్తపేట, పులిచెర్లలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

2, 3న గంగమ్మ జాతర

పుంగనూరు: పుంగనూరు శ్రీసుగుటూరు గంగమ్మ జాతర చాటింపును మంగళవారం సాయంత్రం తోటి కులస్తులు వేశారు. జమీందారుల కుల ఆరాధ్య దైవమైన సుగుటూరు గంగమ్మ జాతరను ఏప్రిల్ 2, 3వ తేదీలలో నిర్వహించనున్నట్లు జమీందారులు తెలిపారు. తోటి, బెస్త, పట్టణ ప్రముఖులు, అర్చకులతో జమీందారులు సమావేశం నిర్వహించి జాతరను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భక్తులకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిశ్చయించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సదుం: జూదం ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మారుతి తెలిపారు. పాలమంద సమీపంలోని నవటకుంట వద్ద పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. జూదగాళ్లను అరెస్ట్ చేసి రూ.5270 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

- 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- ఇంటింటా జోరుగా కరపత్ర ప్రచారం



'మేము సిద్ధం..' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పెద్దిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని, ఇది కొనసాగాలంటే రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఎంసి.పల్లె, సుగాలిమిట్ట, బోడేవారిపల్లె చంద్రమాకులపల్లె, నల్లగుట్లపల్లెతాండ, రాగానిపల్లె గ్రామాలలో 'మేము సిద్ధం...మా బూత్ సిద్ధం' కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు పార్టీ నేతలతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డిలకు ఫ్యాన్‌గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల్ని కనుమరుగు చేసేందుకు ఉమ్మడి పార్టీ అభ్యర్థులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. 2014లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈసారి కూడా అలాగే ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, బాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆలయ అంగళ్ల గేటు వేలం

గుడుపల్లె: శ్రీ ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ ఆవరణలో బుధవారం అంగళ్ల గేటు, ఎద్దుల గేటు, లడ్డు ప్రసాదం గేటు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకులు తెలిపారు. పదిరోజుల ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి క్రయ విక్రయాల కోసం ఎద్దులు తెస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యం



మేము సిద్ధం..అంటూ నినదిస్తున్న నాయకులు

పెద్దపంజాణి: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా రానున్న 48 రోజులు బూత్ స్థాయిలో కమిటీ సభ్యులు కష్టపడి పనిచేయాలని ఎంపీపీ రెడ్డెప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి పిలుపునిచ్చారు. నాగిరెడ్డిపల్లె పంచాయతీలో మంగళవా రం బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ప్రతి బూత్ పరిధిలో ఉన్న ఓటర్లపై ఆయా బూత్ కమిటీ చైర్మన్, సభ్యులు అవగాహన పెంచుకోవాలని, ఈసారి పోలింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. వైస్ ఎంపీపీ జీడీబాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచ్ కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్, నాయకులు శ్రీనివాసులరెడ్డి, లతీఫ్, భాస్కర్‌రెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

గెలిపించండి..తోడుగా ఉంటాం





కుప్పంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్, రామకుప్పం : ఎన్నికల ప్రచారం చేస్తున్న భరత్



రామకుప్పం: బల్ల గ్రామంలో భరత్‌కు హారతి ఇస్తున్న మహిళ

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

కుప్పం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి తమను గెలిపిస్తే కుప్పం అభివృద్ధిని మరింత పరుగులు తీయిస్తామని చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మున్సిపాలిటీలోని 18,19, 20వ వార్డుల్లో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఐదేళ్ల కాలంలో ఎంపీగా రెడ్డెప్ప, ఎమ్మెల్సీగా భరత్ కుప్పం అభివృద్ధి కోసం చేసిన కృషిని తెలియజేశారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు, గ్రామాలకు రోడ్లు, దేవాలయాల నిర్మాణాలతోపాటు పలు అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. పట్టణంలో ప్రధానంగా తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కరించామని, తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మరో పర్యాయం పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, నాయకులు అబ్బాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పం అభివృద్ధికి సైనికుడిలా పనిచేస్తా

రామకుప్పం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ ప్రజలను కోరారు. మండలంలోని బల్ల పంచాయతీలో మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కుప్పం అభివృద్ధికి తాను ఒక సైనికుడిలా పనిచేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే కుప్పం నియోజక వర్గం ప్రగతి పథంలో పయనించిందని స్పష్టం చేశారు. కుప్పంను రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కుప్పం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రజలు కూడా గత ప్రభుత్వంతో పోల్చి తమ ప్రభుత్వం పనితీరును బేరీజు వేసుకుంటున్నారని చెప్పారు. ఎవరు అందుబాటులో ఉన్నారో, ఎవరు తెలంగాణలో ఉంటూ చుట్టపుచూపుగా కుప్పానికి వస్తున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. తొలుత బల్ల గ్రామంలో భరత్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ సభ్యురాలు పెరితాయమ్మ, రెస్కో డైరెక్టర్ థామస్, నేతలు శ్రీనివాసులు, చంద్ర, శంకర్, రవి, లతీఫ్ పాల్గొన్నారు.